తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
jayabheridaily.com
సంపుటి : 01
సంచిక : 28
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
బుధవారం, 09-08-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....

విలేకర్లు కావలెను

ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

## మణిపూర్ తగలబడుతూంటే మోదీ మౌనం

### కాంగ్రెస్ ఎంపీ గొగోయ్




**న్యూఢిల్లీ, ఆగస్టు 8**

ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశంతో కాదని.. మణిపూర్‌కు న్యాయం చేసేందుకే అవిశ్వాస తీర్మానం పెట్టామని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు గౌరవ్ గొగోయ్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చ మంగళవారం లోక్ సభలో ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ చర్చను ప్రారంభిచారు. ఇది సంఖ్యా బలానికి సంబంధించినది కాదని, కేవలం మణిపూర్ రాష్ట్రానికి న్యాయం జరగడం కోసమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటించాలని కోరుతూ తాను ఈ తీర్మానాన్ని ప్రతిపాదించానని తెలిపారు. ఇండియా కూటమి ఈ తీర్మానాన్ని మణిపూర్ రాష్ట్రం కోసం తీసుకొచ్చిందని, మణిపూర్ న్యాయం కోరుతోందని తెలిపారు.మణిపూర్ తగులబడుతోందంటే భారత దేశం తగులబడినట్లేనన్నారు. వివిధ వర్గాల మధ్య ఇంత తీవ్రమైన విద్వేషాన్ని మునుపెన్నడూ చూడలేదన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బిరేన్ సింగ్‌ను ఆ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాజకీయాలు మణిపూర్‌లో రెండు మణిపూర్‌లను సృష్టించాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల జాడ్యం పెరిగిందని ఆరోపించారు. గంజాయి సాగు పెరుగుతోందన్నారు.పార్లమెంటులో మాట్లాడరాదనే మౌనవ్రతాన్ని ప్రధాని మోదీ చేపట్టారని, ఆ వ్రతాన్ని భగ్నం చేయాలనే తాము ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటి వరకు మణిపూర్‌లో ఎందుకు పర్యటించలేదు? దాదాపు 80 రోజుల తర్వాత మాట్లాడినపుడు కేవలం 30 సెకండ్లు మాత్రమే ఎందుకు

మిగతా 2 లో



తెలంగాణ ఏర్పాటు నుండి 7 రెట్లుగా 200 నుండి 1400కు పెంచిన సీఎం కేసీఆర్

రాష్ట్రంలోని 17,227 మంది రేషన్ డీలర్లకు లబ్ధి

రేషన్ డీలర్ల సంఘాలతో మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్ల చర్చలు సఫలం


హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన రేషన్ డీలర్లు

# రేషన్ డీలర్ల కమిషన్ 1400కు పెంపు

**ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో రేషన్ డీలర్ల సంఘం జేఏసీ ప్రతినిధులతో రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, డిప్యూటీ స్పీకర్ పద్మారావ్ గౌడ్, రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి డీలర్ల జేఏసీ నేతల సమక్షంలో జరిపిన సమావేశంలో అన్ని అంశాలను కూలంకషంగా చర్చించారు.**

# అసెంబ్లీ ని సినిమా హాలు గా మార్చారు

### సభలో కేటీఆర్, మల్లారెడ్డి జోకర్ లు
### అవినీతి, చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేప్రయత్నం చేసారు..
### టీ పీసీసీ అధికార ప్రతినిధి అయోధ్య రెడ్డి



**హైదరాబాద్ ఆగష్టు 8**

అసెంబ్లీ ని సినిమా హాలు గా మార్చారని,సభలో కేటీఆర్, మల్లారెడ్డి జోకర్ లు గా వ్యవహరించారని టీ పీసీసీ అధికార ప్రతినిధి అయోధ్య రెడ్డి ఎద్దేవా చేసారు.మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ 9 ఏళ్ళ తర్వాత కూడా అసెంబ్లీ ని ఎలా నడపాలో అధికార పార్టీ కి తెలియక పోవడం సిగ్గుచేటన్నారు. అవినీతి, చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసారన్నరు.రేవంత్ రెడ్డి ని తిట్టడానికే కేటీఆర్ అసెంబ్లీ లో మాట్లాడారన్నారు.ఓ ఆర్ ఆర్ టెండర్ల వివరాలు బయటపెట్టమంటె ఎందుకు బయపడుతున్నారని అయోధ్య రెడ్డి ప్రశ్నించారు.లక్ష జీవోలను దాచిపెట్టారు..కాంగ్రెస్ అబివృద్ధి చేస్తే..బీఆర్ఎస్ ఆ ఫలాలు తీసుకుని.. మేమే చేసామని చెప్పుకుంటుంన్నారని విమర్శించారు.మహారాష్ట్ర లో చనిపోయిన రైతు ల గురించి మాట్లాడిన కేసీఆర్.. తెలంగాణ లో రైతు ల గురించి ఎందుకు మాట్లాడట్లేదన్నారు.రేవంత్ రెడ్డి ని కేటీఆర్ ఏం చేయలేడన్నారు. రేవంత్ అంతు చూడడం కేసీఆర్ నుంచే కాలేదు.. కేటీఆర్. ఏంచేస్తాడన్నారు. అప్పులు కట్టేందుకు అప్పులు తెస్తున్నారు.భయం తో అమిత్ షా ,మోడీ దగ్గర కేటీఆర్ మోకరిల్లుతున్నాడని దుయ్యబట్టారు.. భవిష్యత్ అవసరాలను తాకట్టు పెట్టి భూములు అమ్ముతున్నారని,కేసీఆర్, కేటీఆర్ పాలనకు రాజకీయ పిండం పెడతాం. కేసీఆర్ క్యాబినెట్ లో చంద్రబాబు మినహా మిగతా మంత్రులు అంతా టీడీపీ క్యాబినెట్ ఉందన్నారు.

# ఆప్ పార్టీకి కొత్త చిక్కులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8**




ఢిల్లీ ఆప్ పార్టీకి కొత్త చిక్కులు మొదలయ్యాయి. దుమారం రేపుతున్న ఎంపీల సంతకాల దుర్వినియోగం.. ఆప్ ఎంపీ రాఘవ్‌చద్దాపై చర్యలకు అధికారపక్షం డిమాండ్ చేసింది. చద్దా అనుసరించిన తీరును తప్పుపడుతున్నాయి విపక్షకూటమి సభ్యులు. చద్దా తీరుతో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటోంది ఆప్. ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ ఇచ్చిన నోటీసుపై ఐదుగురు ఇతర పార్టీల ఎంపీల సంతకాలు చద్దా ఫోర్జరీ చేశారని ఆరోపించారు. ఆప్ ఎంపీ చద్దాపై రాజ్యసభ చైర్మన్‌కు ఎంపీలు ఫిర్యాదు చేశారు. నోటీసులు ఇచ్చాక సమాధానం చెబుతానంటున్నారు ఎంపీ చద్దా. ఢిల్లీ సర్వీస్ బిల్లుకు సంబంధించి సోమవారం రాజ్యసభలో తీవ్ర చర్చ జరగగా, ఆ తర్వాత బిల్లు కూడా ఆమోదం పొందింది. ఈ బిల్లును ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఈ చర్చ మధ్యలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దాపై కొందరు ఎంపీలు సంతకాలు ఫోర్జరీ చేయాలని కోరడంతో తీవ్ర ఆరోపణ జరిగింది. చర్చ సందర్భంగా కూడా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ విషయాన్ని ప్రస్తావించి రాజ్యసభ ఛైర్మన్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి, ఢిల్లీకి సంబంధించిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని సిఫారసు చేస్తూ రాఘవ్ చద్దా సభలో ఒక తీర్మానాన్ని సమర్పించారు. ఈ మోషన్‌లో అతను కాకుండా మరో నలుగురు ఎంపీలు సంతకాలు చేశారు. ప్రతిపాదిత సెలెక్ట్ కమిటీ ప్రస్తావన కూడా వచ్చింది. అయితే, అటువంటి తీర్మానంపై తాము సంతకం చేయలేదని లేదా అంగీకరించలేదని తరువాత ఈ ఎంపీలు చెప్పారు. ఇందులో పేర్కొన్న నలుగురు ఎంపీలు రాఘవ్ చద్దాతో పాటు ఎస్. ఢిల్లీకి సంబంధించిన బిల్లు సెలెక్ట్ కమిటీలో కొన్యాక్, నరహరి అమీన్, సుధాన్షు త్రివేది, సస్మిత్ పాత్ర, ఎం. తంబిదురైలను చేర్చినట్లు తెలిసింది. ఈ జాబితాలో నా పేరును రాఘవ్ చద్దా తీసుకున్నారని, దాని గురించి ఆయన నాతో మాట్లాడలేదని, నేను ఎలాంటి సమ్మతి ఇవ్వలేదని బీజేపీ ఎంపీ నరహరి అమీన్ అన్నారు. రాఘవ్ చద్దా చేసింది పూర్తిగా తప్పు. ఆయనతో పాటు, ఇతర ఎంపీలు కూడా ఈ సమస్యపై విచారణ గురించి మాట్లాడారు.ఈ ఎంపీలు కాకుండా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. తామేమీ సంతకం చేయలేదని ఈ సభ్యులే చెప్పారని అమిత్ షా అన్నారు. ఆయన సంతకం ఎక్కడి నుంచి వచ్చిందనేది విచారణలో తేలాల్సి ఉంది. ఇప్పుడు ఈ వ్యవహారం ఢిల్లీలో ఫోర్జరీ మాత్రమే కాదు.. పార్లమెంట్ లోపల కూడా ఫోర్జరీ అనే అంశం. సభ్యుల వాంగ్మూలాన్ని నమోదు చేయాలని, దానిపై కూడా విచారణ జరిపించాలని అమిత్ షా డిమాండ్ చేశారు.ఈ ఆరోపణల తర్వాత, రాఘవ్ చద్దా స్పందించారు. ప్రివిలేజ్ కమిటీ తనకు సంబంధించిన ఏదైనా నోటీసును ఎప్పుడు ఇస్తుందో.. అప్పుడు అతను వివరంగా సమాధానం ఇస్తానని చెప్పారు. ఢిల్లీ సర్వీస్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై సుమారు 8 గంటలపాటు చర్చ జరిగింది. ఆ తర్వాత అమిత్ షా సమాధానమిచ్చారు. గత ఓటింగ్‌లో ఈ బిల్లు ఆమోదం పొందగా.. బిల్లుకు అనుకూలంగా 131 ఓట్లు, ప్రతిపక్షంగా 102 ఓట్లు వచ్చాయి.

## ఆమెజాన్ వర్సెస్ టెలికాం కంపెనీలు

2 లో






2 లో

## కేసీఆర్ వ్యాఖ్యలు వెనుక.. కాంగ్రెస్ పై దాడి

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## మణిపూర్ తగలబడుతూంటే మోదీ మౌనం

మాట్లాడారు? మణిపూర్ ముఖ్యమంత్రిని ఆ పదవి నుంచి ఎందుకు తొలగించడం లేదు? అనే మూడు ప్రశ్నలు మోదీని అడుగుతున్నామని చెప్పారు. అస్సాంలో జాతీయ పౌరుల జాబితా ని అమలు చేయవలసి ఉందని, ఈశాన్య రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని విమర్శించారు. మణిపూర్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. వైఫల్యాలను బీజేపీ అంగీకరించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోనే ఎన్డీయే సర్కారుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభ చర్చ మొదలైంది. నేటి నుంచి మూడు రోజుల పాటు ఈ చర్చ జరగుతుంది. మొత్తం 16 గంటల పాటు చర్చకు సమయాన్ని స్పీకర్ కేటాయించారు. లోక్‌సభలో పార్టీలకున్న సంఖ్యాబలాన్ని బట్టి ఆయా పార్టీలకు మాట్లాడే సమయాన్ని స్పీకర్ కేటాయించారు. సంఖ్యాబలం అధికంగా ఉన్న బీజేపీ సభ్యులకు మాట్లాడేందుకు 6 గంటల 41 నిమిషాల సమయాన్ని స్పీకర్ కేటాయించారు. కాంగ్రెస్ పార్టీకి గంటా 41 నిమిషాల సమయాన్ని కేటాయించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అధికార పార్టీలకు కూడా ఈ చర్చలో పాల్గొనే అవకాశం లభించింది. ఏపీ అధికార పార్టీ వైసీపీకి 29 నిమిషాలు బీఆర్ఎస్ పార్టీకి 12 నిమిషాల సమయాన్ని స్పీకర్ కేటాయించారు. చర్చ ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ సమాధానమిస్తారు.మరోవైపు అవిశ్వాస తీర్మానంపై బీజేపీ నుంచి మాట్లాడే నేతల పేర్లను ప్రకటించింది ఆ పార్టీ. ఇందులో తెలంగాణ బీజేపీ మాజీ సారథి, ఎంపీ బండి సంజయ్‌కు కూడా చోటు కల్పించారు. బీజేపీ నుంచి మాట్లాడే వారిలో నిషికాంత్ దూబే, అమిత్ షా, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, జ్యోతిరాదిత్య సింధియా, స్మృతి ఇరానీ, లాకెట్ ఛటర్జీ, బండి సంజయ్, రాజ్‌దీప్ రాయ్, రామ్ కృపాల్ యాదవ్, విజయ్ బాఘేల్, రమేష్ బిధూరి, సునితా దుగ్గల్, హీనా గావిట్, రాజ్యవర్ధన్ రాథోడ్ ఉన్నారు. ఈ చర్చలో హోంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకోవడం ద్వారా మాట్లాడనున్నారు.అంతకు ముందు.. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యుల నినాదాలు మొదలయ్యాయి. ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు స్పీకర్ ప్రకటించారు. కాని, విపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభను వెంటనే మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ నిబంధనల విషయంలో గందరగోళం చోటుచేసుకుంది. ఈ క్రమంలో టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్, సభాధ్యక్షుడు జగదీప్ ధన్కడ్ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆయనను సభ నుంచి ఈ సమావేశాలు పూర్తయ్యేంత వరకు సస్పెండ్ చేస్తున్నట్టు రాజ్యసభ అధ్యక్షుడు ప్రకటించారు. ఈ సమావేశాల్లో ఇది రెండో సస్పెన్షన్. సమావేశాల ప్రారంభంలోనే ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను సభ సస్పెండ్ చేసింది. లోక్‌సభలో అవిశ్వాసంపై బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వరరావు మాట్లాడారు. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. తెలంగాణ ప్రగతి, పాలనా విజయాలను పార్లమెంట్ వేదికగా చెబుతామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఇస్తున్న నిధులు చాలా తక్కువని పేర్కొన్నారు నామా నాగేశ్వర రావు. దేశంలో ప్రస్తుతం మణిపూర్‌తోపాటు అనేక సమస్యలు ఉన్నాయని, ప్రధాని మోదీ మణిపూర్‌పై మాట్లాడకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు నామా. బీఏసీ సమావేశం నుంచి తొలిసారి వాకౌట్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

కూటమి పార్టీలకు విశ్వాస పరీక్ష మోదీ సెటైర్లు

లోక్‌సభలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇండియాలోని పార్టీలకు విశ్వాస పరీక్షేనని ఎద్దేవా చేశారు ప్రధానమంత్రి మోదీ. 2024 జనరల్ ఎలక్షన్‌ల కంటే ముందే సెమీఫైనల్ చూడాలని ప్రతిపక్షాల కూటమి కోరుకుందని అభిప్రాయపడ్డారు. ఆ సెమిఫైనల్ రిజల్ట్ ఎలా ఉందో అందరూ చూశారని అన్నారు. బీజేపీ పార్లమెంట్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధానమంత్రి మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ సర్వీసెస్ బిల్లు,అవిశ్వాస తీర్మానంపై జరిగిన మాటల యుద్ధం, జరుగుతున్న పరిణామాలను ఉదహరిస్తూ మోదీ ఈ కామెంట్స్ చేశారు. ఈ భేటీలో విపక్ష కూటమిపై ప్రధానమంత్రి మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వాళ్లంతా ఒకరిపై ఒకరు అపనమ్మకంతో ఉన్నారని ఇదే వాళ్ల పతనానికి దారి తీస్తుందని జోస్యం చెప్పారు . అవిశ్వాస తీర్మానం సందర్భంగా మాట్లాడే వారి జాబితాను గుర్తు చేస్తూ వారంతా ఆఖరి బాల్‌కు సిక్స్ కొట్టాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు మోదీ. కూటమిలోని పార్టీలకు పరీక్ష పెట్టుకునేందుకే ఈ అవిశ్వాస తీర్మానాన్ని తెరపైకి తీసుకొచ్చారని మోదీ ఎద్దేవా చేశారు. ఎవరి కూటమిలో ఉన్నారో ఎవరు లేరో ఈ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ సందర్భంగా తేల్చుకుంటారని విమర్శించారు. 2018లోనే వారిపై అవిశ్వాసం ప్రకటించామన్నారు మోదీ. కూటమిని మోదీ "ఘమండియా" అని మరోసారి పిలిచారు. హిందీలో ఘమండియా అంటే అహంకారం అని అర్థం. ఆ కూటమిలోని కొందరు నేతలు చాలా అహంకారంతో ఉన్నారని, వాళ్లంతా బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నియంత్రుత్వ పోకడలను ప్రోత్సహిస్తూ ఇండియా కూటమిలో ఉన్న వాళ్లు ఇప్పుడు సామాజిక న్యాయం కోసం మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏకైనా విపక్షాలు ఇండియాగా ఏర్పడ్డాయి. అప్పటి నుంచి ఆ కూటమిపై మోదీ ఎదురు దాడి చేస్తూనే ఉన్నారు. యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌ను కొత్తగా బ్రాండింగ్ చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు.దేశాభివృద్ధికి ప్రతిపక్ష కూటమి "అడ్డంకి"గా మారిందని ఇండియా అనేది అవినీతి, వారసత్వ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం చర్చకు రానున్న సందర్భంగా బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కీలక కామెంట్స్ చేశారు. ఈ భేటీకి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ఆ పార్టీ ఎంపీ జేపీ నడ్డా హాజరయ్యారు.

## కలవరపెడుతున్న కరోనా కొత్త వేరియంట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 8**

కొవిడ్ కొత్త వేరియంట్.. పేరు ఎరిస్. కోవిడ్ థర్డ్‌వేవ్‌లో ప్రపంచాన్ని భయపెట్టిన ఒమిక్రాన్‌కి ఇది సబ్‌వేరియంట్. బ్రిటన్‌లో పుట్టి.. ఆ దేశాన్ని తీవ్రంగా వణికిస్తోంది. జూలై 3న ఎరిస్ వేరియంట్ మొదటి కేసును గుర్తించామని, బ్రిటన్‌లో ఇది వేగంగా వ్యాపిస్తోందని, కేసుల సంఖ్య పెరుగుతోందని ప్రకటించింది యూకే హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ. బ్రిటన్‌లో గత వారం రోజుల్లోనే 8 వేలమంది ఆస్పత్రుల్లో చేరారని, వీరిలో 398 కొత్త వేరియంట్ ఇన్ఫెక్షన్స్ గుర్తించామని చెబుతోంది డబ్ల్యు.హెచ్.ఓ. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఏసియాలో కోవిడ్ కేసులు పెరగడంతో స్క్రీనింగ్ మీద దృష్టి పెట్టింది యూకే. ఇందులో భాగంగానే ఈ కొత్త వేరియంట్ బైటపడింది. నమోదౌతున్న ప్రతీ ఏడు కోవిడ్ కేసుల్లో ఒకటి ఎరిస్ వేరియంటేనని, ఇది ఆషామాషీ వేరియంట్ కాదని, బ్రిటన్‌ని దెబ్బతీసిన ప్రమాదకర వేరియంట్లలో ఎరిస్ రెండోదని చెబుతోంది యూకే హెల్త్ విభాగం. అటు.. బ్రిటన్‌కి ఇరుగుపొరుగు దేశాల్లో, ముఖ్యంగా మిడిలీస్ట్ కంట్రీస్‌లో హైఅలర్ట్ మొదలైంది. యూఎస్, జపాన్ దేశాల్లో ఇప్పటికే కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. జూలై 3న ఎరిస్ వేరియంట్ మొదటి కేసు నమోదైంది. బ్రిటన్‌లో ఎరిస్ వేరియంట్ వేగంగా వ్యాపిస్తోంది. అత్యంత ప్రమాదకర వేరియంట్లలో ఎరిస్ రెండోది. బ్రిటన్‌కి ఇరుగుపొరుగు దేశాల్లో హైఎలర్ట్ జారీ చేశారు. ఇమ్యూనిటీ పెంచుకోవాలి' అని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.మరి ఇండియాక్కూడా మరోసారి కోవిడ్ ముప్పు తప్పదా? కొత్త వేవ్ ముంచుకొచ్చే ప్రమాదం ఎంతవరకుంది అనే చర్చ ఇక్కడ కూడా మొదలైంది. అధికపక్షం జనాభా వ్యాక్సినేషన్ పూర్తి చేసుకుని కావల్సినంత ఇమ్యూనిటీ సాధించారని, ఒకవేళ ఎరిస్ వేరియంట్ ఇండియాకు చేరినా.. దాని వ్యాప్తి భయపడాల్సినంత స్థాయిలో ఉండబోదని చెబుతున్నారు. ఇమ్యూనిటీ మేనేజ్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. 'ఇప్పటివరకైతే కొత్త వేరియంట్ ఇండియాకి చేరుకోలేదు. మనదాకా వచ్చే ఛాన్స్ కూడా లేదనేది ఎక్స్‌పర్ట్స్ మాట. కానీ... ముందుజాగ్రత్తగా కోవిడ్ గైడ్‌లైన్స్ పాటించాల్సిందే అనే హెచ్చరికలున్నాయి. ఇన్‌ఫెక్షన్ సోకకుండా బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలనే ఆదేశాలు త్వరలో వచ్చినా రావొచ్చు' అని అమెరికాకు చెందిన డా. శరత్ అద్దంకి తెలిపారు.

# రేషన్ డీలర్ల కమిషన్ 1400కు పెంపు

**హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో రేషన్ డీలర్ల సంఘం జేఏసీ ప్రతినిధులతో రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, డిప్యూటీ స్పీకర్ పద్మారావ్ గౌడ్, రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి డీలర్ల జేఏసీ నేతల సమక్షంలో జరిపిన సమావేశంలో అన్ని అంశాలను కూలంకషంగా చర్చించారు. మెట్రిక్ టన్నుకు ప్రస్థుతమున్న 900 రూపాయల నుండి 1400 రూపాయలకు ముఖ్యమంత్రి ఆదేశంతో పెంచుతున్నట్టు మంత్రులు హరీష్‌రావు, గంగుల కమలాకర్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17,227మంది రేషన్ డీలర్లకు లబ్ధీ చేకూరుతుంది, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా 139 కోట్ల అధనపు భారం పడుతుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని అన్నివర్గాల్లోని ప్రతీ ఒక్కరి సంక్షేమాన్ని చూస్తున్నారని, రేషన్ డీలర్లను సైతం ఆదుకోవాలని ఆదేశించారని మంత్రులు తెలియజేసారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డప్పుడు కేవలం మెట్రిక్ టన్నుకు 200 రూపాయలు మాత్రమే ఉండేదని ప్రస్థుతం దానిని 1400 రూపాయలకు పెంచామన్నారు. అతి తక్కువ సమయంలో 700 శాతం కమిషన్ పెంచిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. దేశంలోని ఏరాష్ట్రంలోనూ కేంద్ర ప్రభుత్వ కోటాకు అధనంగా ఇవ్వడం లేదని కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని 90.05 లక్షల కార్డుల్లో దాదాపు 35.56 లక్షల కార్డుల్లోని 91 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున అందించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్డులకు సైతం అధనంగా కిలోను కేటాయిస్తున్నామన్నారు. కమిషన్ సైతం కేంద్రం పెంచుకున్నా పెంచి అందిస్తున్నామన్నారు. ఏకమొత్తంగా రెండు రెట్లు కమిషన్ పెంచడమే కాకుండా రేషన్ డీలర్లు అడుగుతున్న ప్రధానమైన 13 అంశాలను పరిష్కరించారు. కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్షిప్ మంజూరు చేయడం, రాష్ట్రంలో అమలవుతున్న రైతు, నేత, గౌడ తదితర బీమాల తరహాలో రేషన్ డీలర్లకు 5లక్షల బీమా అమలు చేయడం, ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రతీ డీలర్ను తీసుకురావడం, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఖచ్చితమైన తూకం వేసేలా వేబ్రిడ్జిల ఏర్పాటు, డీలర్షిప్ రెన్యూవల్ని 5 ఏళ్ల కాలపరిమితికి పెంచడం, రేషన్ డీలర్షిప్ వయోపరిమితిని 40 నుండి 50 ఏళ్లకు పెంపు, అంత్యక్రియల నిర్వహణకు తక్షణ



సాయం 10 వేలు, 1.5 క్వింటాళ్ల వేరియేషన్ను కేసుల పరిధినుండి తీసివేయడం, హైదరాబాద్లో రేషన్ భవన్ నిర్మాణానికి భూకేటాయింపు తదితర 13 అంశాలపై సానుకూలత వ్యక్తం చేసారు. డీలర్ల కమిషన్ పెంపు సహా తమ ఇతర సమస్యల పరిష్కారించిన ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కి రేషన్ డీలర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. తమ కడుపునిండా పెట్టేలా కృషి చేసిన మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్‌లకు, డిప్యూటీ స్పీకర్ పద్మారావ్ గౌడ్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు సమావేశంలోనే ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు సివిల్ సప్లైస్ కమిషనర్ వి.అనిల్ కుమార్, రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు నాయికోటి రాజు, మల్లిఖార్జున్, రవీందర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వ్యాఖ్యలు వెనుక.. కాంగ్రెస్‌పై దాడి

**హైదరాబాద్, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)**

తెలంగాణ అసెంబ్లీలో కేసీఆర్ చేసిన ప్రసంగంలో ఎవరూ ఊహించని.. ఇంతకు ముందు ఎప్పుడూ చెప్పనిది.. తెలంగాణకు నెహ్రూ చేసిన అన్యాయం. కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం గురించే. నిజానికి దేశంలో జరిగే అనర్థాలకు నెహ్రూను బీజేపీ నిందిస్తుంది. కానీ తెలంగాణకు కూడా నెహ్రూ అన్యాయం చేశారని కేసీఆర్ చెప్పడంతో చాలా మందికి కొత్త సందేహాలు వస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా చెప్పని విషయాలు ఇప్పుడు కేసీఆర్ ఎందుకు చెబుతున్నారు అనే సందేహం ఎక్కువ మందికి వస్తోంది. దీని వెనుక ఉన్న కేసీఆర్ వ్యూహం ఏమిటి ?ఉన్న తెలంగాణను ఊడగొట్టింది ఎవరు ? దీనికి ఎవరు బాధ్యులు ? అంటే జవహర్‌లాల్ నెహ్రూ అని కేసీఆర్ తేల్చి చెప్పారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేస్తున్నప్పుడు తెలంగాణ విద్యార్థులు, మేధావులు, ప్రజలు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారని కేసీఆర్ చెప్పారు. ఆనాడు ఉన్న కొండా వెంకటరంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వ్యతిరేకించినా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను ఏర్పాటు చేశారన్నారు. ఇది చరిత్రలో రికార్డయ్యిందని.. ఇక్కడి నుంచి విమానంలో వెళ్లే సమయంలో రామకృష్ణారావు తెలంగాణ తప్ప మరోమాట లేదని చెప్పారన్నారు. ఢిల్లీలో బలవంతంగా ఒప్పించిన తర్వాత.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో నెహ్రూ సాబ్ చెప్పిన తర్వాత ఏం మాట్లాడుతాం అన్నారని కేసీఆర్ చెప్పారు.



ఇది కూడా చరిత్రలో ఉన్నది. ఇది కల్పిత కథ కాదని కూడా వివరించారు. ఆ విధంగా ఉన్న తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్ అని తేల్చేశారు. తెలంగాణ విషయంలో నెహ్రూ చేసిన తప్పిదాన్ని కాంగ్రెస్ కొనసాగించిందని కేసీఆర్ చెబుతున్నారు. తెలంగాణ ప్రజల్ని ఎంత రాచి రంపాన పెట్టారో.. ఎంత మందిని కాల్చి చంపారో.. ఆ ఘనత చరిత్ర అంతా కాంగ్రెస్‌కే చెందుతుందన్నారు తెలంగాణ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన లాస్ట్ స్పీచ్.. ఎన్నికల ఎజెండాను ఖరారు చేసేదే. అందులో నెహ్రూ ప్రస్తావన ఉంది.

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యయం గురించి ఉంది. అంటే.. తెలంగాణ విషయంలో కాంగ్రెస్‌కు ప్రజల్లో ఉన్న సానుకూలతను పూర్తిగా తగ్గించే వ్యూహంలోనే కేసీఆర్ ఈ ప్రకటనలు చేశారని భావిస్తున్నారు.

తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసుకుంటోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయడం వల్ల రాజకీయంగా తీవ్రంగా నష్టపోతామని తెలిసినా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి తాము బలి అయ్యామని అంటున్నారు. దీనికి ప్రతిగా తమకు తెలంగాణలో ప్రతి ఒక్కరూ ఒక్క ఓటు ఇవ్వాలని అడుగుతున్నారు. ఇలాంటి సెంటిమెంట్ వర్కవుట్ అయితే బీఆర్ఎస్‌కు ఇబ్బందికరమే. ఎందుకంటే ఇప్పటికే కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్ ను త్యాగం చేసి.. జాతీయ వాదంతో పార్టీ పెట్టారు. ముందు ముందు తెలంగాణకు అన్యాయం చేసిన కోణంలో కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ మరంత ఎక్కువగా విరుచుకుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నెహ్రూ అంశాన్ని.. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో వద్దన్నా కూడా తెలంగాణను ఏర్పాటు చేయడం సహా మిగతా అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తెలంగాణ ఇచ్చిన పార్టీ అనే సెంటిమెంట్ పెరగకుండా చేయాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. అదే సమయంలో కేసీఆర్ వ్యూహాన్ని పసిగట్టిన కాంగ్రెస్ పార్టీ కౌంటర్ రాజకీయాలు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణ కేంద్రం కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య యుద్ధం జరగడం ఖాయంగా కనిపిస్తోంది.




## ఆమెజాన్ వర్సెస్ టెలికాం కంపెనీలు

**ముంబై, ఆగస్టు 8**

భారత టెలికాం దిగ్గజాలు అంతర్జాతీయ కంపెనీల మధ్య ఎస్ఎంఎస్ ఛార్జీల వివాదం క్రమంగా ముదురుతోంది. తాము పంపించే సందేశాలకు స్థానిక రేట్లు తీసుకోవాలని అమెజాన్, గూగుల్ వంటి కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆ సందేశాల పుట్టిన సర్వర్లు విదేశాల్లో ఉన్నాయి కాబట్టి అంతర్జాతీయ రేట్లే తీసుకుంటామని జియో (Jio), ఎయిర్‌టెల్ (Airtel), వొడాఫోన్ ఐడియా (Vi) అంటున్నాయి. కాగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ విడుదల చేసిన పేపర్లలో అమెజాన్ ఇచ్చిన వివరణ ఇప్పుడు సంచలనంగా మారింది.తమ కస్టమర్లకు నిరంతరం అప్‌డేట్లు ఇవ్వడానికి కంపెనీలు సందేశాలు పంపిస్తుంటాయి. ఉదాహరణకు అమెజాన్‌లో షాపింగ్ చేస్తే కన్ఫర్మేషన్, డెలివరీ స్టేటస్, ఓటీపీ వంటి సందేశాలు పంపిస్తుంది. ఈమెయిల్‌కు లాగిన్ అయినప్పుడు గూగుల్ సైతం టూ ఫ్యాక్టర్ అథంటికేషన్‌లో భాగంగా ఓటీపీలు పంపిస్తుంటుంది. మెటా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇక జొమాటో, స్విగ్గీ, పేటీఎం, ఫోన్‌పే, బ్యాంకులు సహా అన్ని కంపెనీలు సందేశాలు పంపిస్తూనే ఉంటాయిఇలాంటి పంపించే సందేశాలను డొమస్టిక్, ఇంటర్నేషనల్ అని రెండు రకాలు విభజిస్తారు. టెలికాం కంపెనీలు లోకల్ మెసేజీలకు ఒక్కో దానికి 13 పైసలు తీసుకుంటున్నాయి. విదేశాల నుంచి వచ్చే వాటికి ఐదు సెంట్లు లేదా 4.10 రూపాయాలు వసూలు చేస్తున్నాయి. ఆరు నెలల క్రితమే టెలికాం కంపెనీలు ఈ ఛార్జీలను 25 శాతం మేర పెంచాయి. దాంతో అమెజాన్, ఉబెర్ వంటి కంపెనీలు తమ సందేశాల సంఖ్యను బాగా తగ్గించేశాయి.ఈ ఛార్జీలపై మిగతా వాటితో పోలిస్తే అమెజాన్ కాస్త గట్టిగానే పోరాడుతోంది. తమకు ఇండియన్ సబ్సిడరీ కంపెనీ అని, ఇక్కడ నుంచే సందేశాలు పంపిస్తున్నామని వాదిస్తోంది. కాబట్టి ఒక్కో దానికి 13 పైసలు మాత్రమే తీసుకోవాలని కోరుతోంది. ఈ మేరకు టెలికాం అథారిటీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ట్రాయ్ విడుదల చేసిన చర్చా పాత్రంలో అమెజాన్ వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి.'ఎస్ఎంఎస్ టెర్మినేషన్ ఛార్జీలను కంపెనీలే భరిస్తున్నాయి. స్థానిక, అంతర్జాతీయ సందేశాల నిర్వచనంపై స్పష్టత లేకపోవడం వల్ల టెలికాం కంపెనీలు తమ వాదనకు అనుకూలమైన పద్ధతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. కంప్యూటర్ రిసోర్స్ లేదా సర్వర్లు విదేశాల్లో ఉంటే అంతర్జాతీయ సందేశంగా భావిస్తున్నాయి. నిజానికి ఆ సందేశాల పుట్టుకలో భారత్ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల నెట్‌వర్క్ పాత్ర పరిమితంగా ఉంటుంది. టెలికాం నెట్‌వర్క్‌తో అవసరం లేకుండానే నేరుగా వినియోగదారులకు సందేశాలు వెళ్లే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది' అని అమెజాన్ తెలిపింది.అమెజాన్ వ్యాఖ్యలపై జియో, వొడాఫోన్ ఐడియా మండిపడ్డాయి. 'గతంలో తమ కాల్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయో చెప్పేందుకు ఇష్టపడని కంపెనీలు ఇప్పుడు తమ సందేశాలు విదేశాల్లోనే జరుగుతోందని ఒప్పుకుంటున్నాయి. టెక్నాలజీలో ముందడుగు, వినియోగదారుల ప్రయోజనాల పేరుతో ట్రాయ్ నిబంధనలను పాటించకపోవడం సబబే అన్నట్టుగా మాట్లాడుతున్నాయి' అని రిలయన్స్ జియో తెలిపింది. మోసం కిందకే వస్తుంది. స్థానిక సందేశాల ముసుగులో అంతర్జాతీయ సందేశాలు పంపించడం గ్రే వాయిస్ కాల్స్ వంటి మోసమే అవుతుంది. వాణిజ్య ప్రయోజనాల కోసం డొమస్టిక్ కాల్స్‌ను ఇంటర్నేషనల్ కాల్స్‌గా టెర్మినేట్ చేసేవాళ్లు. ఇప్పుడు టెక్నాలజీ ముందడుగు గురించి చెప్పడమూ అలాంటిదే' అని వొడాఫోన్ ఐడియా పేర్కొంది.

# మునుగోడు మొనగాడు ఎవరో

**నల్గొండ, ఆగస్టు 8 :**

తెలంగాణలో ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన పార్టీలు రేసు గుర్రాలపై దృష్టిపెట్టాయి. గతేడాది ఉపఎన్నికతో అందరి దృష్టిని ఆకర్షించింది మునుగోడు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ప్రధాన పార్టీల నుంచి ఎవరు పోటీ చేయబోతున్నారనేది మరోసారి ఆసక్తికరంగా మారింది.మరికొద్ది రోజుల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. పోటీలో నిలిచి గెలిచే వారి జాబితాను కూడా రెడీ చేసుకునే పనిలో పడ్డాయి. కీలకమైన స్థానాల విషయంపై కూడా మేథోమథనం చేస్తున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే... ఇప్పటికే ఎన్నికల మూడ్ లోకి వెళ్లిన పార్టీలన్నీ ప్రత్యర్థిని ఢీకొట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇక గతేడాది తెలంగాణ రాజకీయాలనే షేక్ చేసేలా మునుగోడు బైపోల్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఇక్కడ్నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎవరు..? మునుగోడులో రాజకీయం ఎలా ఉండబోతుందన్న చర్చ ఇప్పుడిప్పుడే తెరపైకి వస్తోంది. గతేడాది బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు కొత్తవారు కూడా ప్రయత్నాల్లో ఉండటంతో మునుగోడు రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతుందనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారింది. నియోజకవర్గం ఏర్పడిన రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ఉండగా... ఆ తర్వాత కమ్యూనిస్టుల కంచుకోటగా మారిపోయింది. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభావం, వర్తమాన రాజకీయల్లో చోటు చేసుకుంటున్న పరిస్థితులతో ఇక్కడ కమ్యూనిస్టుల ప్రభావం తగ్గిపోయింది. అనూహ్యంగా కాంగ్రెస్ నుంచి గెలిచిన రాజగోపాల్ రెడ్డి... బీజేపీలో చేరటం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయటంతో గతేడాది ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో భాగంగా కామ్రేడ్లతో పొత్తు పెట్టుకున్న బీఆర్ఎస్... 10 వేల మెజార్టీతో విజయం సాధించింది. ఇక మరికొద్ది నెలల్లోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రధాన పార్టీల నుంచి పాత అభ్యర్థులే బరిలో ఉంటారా లేక మారుతారా అన్న చర్చ నియోజకవర్గంలో జోరందుకుందిగతేడాది జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కుమార్తె స్రవంతి బరిలో నిలవగా... బీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిలబడ్డారు. ఇక బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ చేశారు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు మారే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ నుంచి చల్లమల్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో అన్నీతానై నడిపిస్తున్నారు. పార్టీ అధ్యక్షుడి ఆశీస్సులు కూడా ఆయనకు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. దాదాపు ఆయనే బరిలో ఉంటారని తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీలోనే కొనసాగుతుండగా.. మళ్లీ ఇక్కడ్నుంచే పోటీ చేస్తారా లేదా అనే దానిపై క్లారిటీ రావటం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఒకవేళ అలా జరగకపోతే... బీజేపీ అభ్యర్థిగా మునుగోడులో మళ్లీ ఆయనే పోటీ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. ఆయన బరిలో ఉండకపోతే... పార్టీ సీనియర్ నేత మనోహర్ రెడ్డి ఉండే ఛాన్స్ ఉంది.బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విషయానికొస్తే అత్యంత ఆసక్తిని రేపుతోంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కూసుకుంట్లకు టికెట్ దక్కే అవకాశాలు చాలా తక్కువ అన్న చర్చ నియోజకవర్గంలో జోరుగా నడుస్తోంది. గత ఉపఎన్నికల టైంలోనే ఆయన అభ్యర్థితత్వాన్ని సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకించారు. హైకమాండ్ పెద్దల ఎంట్రీతో అసమ్మతి నేతలతో చర్చలు జరిపి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఉపఎన్నిక కోసం పార్టీ అంతా కష్టపడినప్పటికీ... ఆయనకు కేవలం 10 వేల మెజార్టీనే వచ్చింది. ఇటీవలే బీఆర్ఎస్ లో చేరి కార్పొరేషన్ ఛైర్మన్ గా అవకాశం దక్కించుకున్న జర్నలిస్ట్ నేత పల్లె రవి కుమార్ గౌడ్ కూడా సీరియస్ గా ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఎవరికి వారుగా ప్రయత్నాల్లో ఉంటే... కొద్దిరోజులుగా గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. సామాజిక, సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతూ... గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో పడ్డారు.

పార్టీ టికెట్ దక్కించుకొని మునుగోడు లేదా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి బరిలో ఉండాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపు అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది మాత్రం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇక బీఎస్పీ నుంచి మరోసారి శంకరాచారినే ఉండే అవకాశం ఉంది.మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.... మరోమారు మునుగోడు పాలిటిక్స్ రసవత్తరంగా మారటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక రేసులో ఉండే అభ్యర్థులు ఎవరనే దానిపై రాబోయే రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది.

# సెట్విన్ సెంటర్ లో వృత్తి, విద్యా, నైపుణ్య కోర్సులలో శిక్షణ

**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సెట్విన్ సెంటర్ లో వివిధ వృత్తి, విద్యా, నైపుణ్య కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు, వ్రాయు విధానాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఇస్లావత్ నమ్య, సెట్విన్ ఇంచార్జ్ వనజ కలిసి పరిశీలించారు. సెట్విన్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటిషియన్, ఫ్యాషన్ డిసైనింగ్, ఏసీ, ఫ్రిడ్జ్, మొబైల్ రిపేరింగ్, మగ్గం వర్క్స్, జ్యుట్, పేపర్ బ్యాగ్ మొదలైన కోర్సులలో శిక్షణ పొందిన... నగరంలోని వివిధ కేంద్రాలలో శిక్షణ పొందిన... సుమారు 350 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని ఇక్కడ సెంటర్ లో పరీక్షలు రాస్తున్నారని వనజ తెలిపారు. 3 రోజుల పాటు జరిగే ఈ పరీక్షల నిర్వహణకు విద్యార్థులకు అవసమైన మౌళిక వసతులు కల్పించామని, పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికేట్ అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.







# తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలని లక్ష్యం


## చిల్కానగర్ డివిజన్లో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల



**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిగ్భ తుల్ల తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తల్లి బిడ్డ సంక్షేమంగా ఉండాలని సదుద్దేశంతో ఏ చిన్నారులు మరియు గర్భిణీ స్త్రీలు అయితే వ్యాక్సిన్ తీసుకోలేదో వాటిని గుర్తించి టీకాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది అన్నారు. నూతనంగా తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఆశ వర్కర్ల ద్వారా ఇంటింటికి సర్వే చేయించి వ్యాక్సిన్ తీసుకొని వారి జాబితాను తయారు చేశారని వారందరికీ చిల్కానగర్ డివిజన్లో పలు సెంటర్ల ద్వారా వ్యాక్సినేషన్ చేస్తున్నరని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ఉప్పల్ ఆరోగ్య సిబ్బందినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఅర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల రెడ్డి, కొక్కొండ జగన్, ప్రతాప్ రెడ్డి, రవీందర్ గౌడ్, సుందర్, బాలేందర్, మహిళ అధ్యక్షురాలు సుభద్ర ఆండాలు, సత్యవతి, PHC సిబ్బంది కరుణాదేవి, ప్రమీల, గొంగడయ్య, రామాంజనేయులు, నర్సింగ్ నేత, MD షఫీ, MD గౌస్, కుమార్, ఫోటో బాలు, Md హనీఫ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గృహ లక్ష్మీ పథకం ద్వారా ఇల్లు లేని వారికి, నిరు పేదలకు గొప్ప వరం**

**చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ్మా రెడ్డి, కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ**

**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ మున్సిపాలిటీ, మేడ్చల్ పట్టణ పుర ప్రముఖులకు, మేడ్చల్ మున్సిపాలిటీ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా సొంత స్థలం ఉండి ఇళ్లులేని నిరుపేదల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న గృహలక్ష్మి పథకాన్ని మేడ్చల్ పట్టణ లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదేశానుసారం మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మర్రి దీపికా నర్సింహ్మా రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ టి ఎస్ వి ఎన్ త్రిలేశ్వర్ రావు సూచించారని మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ తెలిపారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తునటువంటి కార్యక్రమాలల్లో భాగంగా తెలంగాణలో ఇల్లు లేని నిరుపేదల కోసం అమలుపరుస్తున్న గృహ లక్ష్మి పథకాన్ని గూర్చి మేడ్చల్ పుర ప్రజలకు వివరించాలని మంత్రి మల్లారెడ్డి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వార సొంత స్థలం ఉండి, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 3 లక్షల ఆర్థిక సాయాన్ని మూడు దశల్లో ఇవ్వనున్నారని, ఇంటి బేస్మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు దశలో రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ. లక్ష చెల్లిస్తారని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు ఆన్లైన్లో లేదా మున్సిపల్ కార్యాలయంలో ఆఖరి తేది ఈ నెల ఆగస్టు 10వ తేది వరకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ.

**ధరఖాస్తు ధారులు** 1. రెండు పాస్ ఫోటోలు, 2. ఆహారభద్రత కార్డు, 3. ఓటర్ ఐ డి, 4. ఆధార్ కార్డు, 5. ఇంటి స్థలం యొక్క ధస్తావేజులు, 6. ఇంటి పన్ను రశీదు, 7. కరెంట్ బిల్లు రశీదు, 8. బ్యాంక్ బుక్ జిరాక్స్ ధరఖాస్తు ఫారం కు జతచేయాల్సి ఉంటుందని కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ అన్నారు.

# కేంద్రం వదిలేసింది.. రాష్ట్రం ఆదరించింది

## ఫలించిన ఎమ్మెల్యే కృషి.. ఉప్పల్ రహదారి పనులు ప్రారంభం

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ రహదారి పనులు ప్రారంభం కానున్నాయి. ఉప్పల్ ఎలిమిటెడ్ కారిడార్ పనుల జాప్యంతో ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 169.17 లక్షల తో బీటీ రోడ్డు పనులు చేపట్టనుంది. ఈ పనులు ప్రారంభం అవుతున్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు జాప్యం చేస్తూ వస్తున్న కేంద్రం తీరును నిరసిస్తూ చాలా మంది నిరసన వ్యక్తం చేశారు. ప్రజల వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి కేటీఆర్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి సమస్యను తెలియజేశారు. అదేవిధంగా సమస్య తీవ్రతను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. స్పందించిన ప్రభుత్వం పనులు ప్రారంభించేందుకు సత్వరం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే కృషితో పనులు ప్రారంభం అవుతున్న సందర్భంగా ఉప్పల్ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# బీఆర్ఎస్, ఆమ్ఆద్మీ పార్టీలది మద్యం బంధం

**న్యూఢిల్లీ ఆగష్టు 8**

ఢిల్లీ ప్రజలకు ప్రత్యేక అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆమ్ ఆద్మీ పార్టీ ల మధ్య మద్యం బంధం ఉందని, కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. ఆస్తులు, ఇతర అంశాలను తారుమారు చేయడానికి మాత్రమే ఆప్ పార్టీ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తోందని, అవినీతి, కుంభకోణాలకు అడ్రస్ గల పార్టీ అని.. అలాంటి అవినీతి పార్టీకి బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలుపుతున్నారంటే తెలంగాణ ప్రజలు గుర్తించాలన్నారు. అవినీతి పార్టీలకు చెక్ పెట్టేందుకు ఒక ఉద్యమం చేపట్టబోతున్నామని లక్ష్మణ్ అన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను రాజకీయంగా పుట్టగతులు లేకుండా చూడాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందన్నారు. మరోసారి అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చారని, ఇండియా కూటమిలోనే ఒకరిపై ఒకరికి విశ్వాసం లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పథకాలను చూడలేక ప్రతిపక్షాలు అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టాయని దుయ్యబట్టారు.

చర్చకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉంటే సభ నుండి పారిపోతున్నారని, అమిత్ షా కూడా మణిపూర్ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నారని చెప్తుంటే అవిశ్వాసం పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటున్నారా..!



**జయభేరి, మేడిపల్లి :**

**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

సొంత జాగా ఉండి ఇళ్లులేని నిరుపేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. తెలంగాణలో ఇల్లు లేని నిరుపేదల కోసం ఈ పథకం తీసుకొస్తున్నట్లు సీఎం కేసీఆర్ ఇంతకు ముందే ప్రకటించారు. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించనుందని దీనిని మూడు దశల్లో ఇవ్వనున్నారని ఇంటి బేస్మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు దశలో రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ. లక్ష చెల్లిస్తారని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు.

**అర్హతలు, మార్గదర్శకాలు**

గృహలక్ష్మి ఇంటిని మహిళ పేరిటే మంజూరు చేస్తారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఖాళీ జాగా ఉండాలి. లబ్ధిదారుడు లేదా ఆ కుటుంబ సభ్యుల పేరిట ఆహార భద్రతా కార్డు (Ration Card)ఉండాలి. లబ్దిదారుడు తనకు నచ్చిన డిజైన్‌లో ఇంటిని నిర్మించుకోవచ్చు. ఈ పథకం రెండు పడకల ఆర్సీసీ ఇంటి నిర్మాణానికే వర్తిస్తుంది. లబ్ధిదారుడు అదే ప్రాంతానికి చెందిన వారై ఉండాలి. ఆధార్/ఓటర్ ఐడీకార్డులు ఉండాలి. బ్యాంకులో ప్రత్యేక అకౌంట్ ఓపెన్ చేయాలి. ఇప్పటికే ఆర్సీసీ రూఫ్‌తో కూడిన ఇల్లు ఉన్నా, జీవో 59 కింద లబ్ధి పొందినా పథకం వర్తించదు. ప్రతి నియోజకవర్గంలోని లబ్ధిదారుల్లో ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 10 శాతం, బీసీ, మైనార్టీలు కలిపి 50 శాతం ఉండాలి. నిధుల విడుదల అధికారం కలెక్టర్లదే. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక '**గృహలక్ష్మి**' లోగోను తప్పనిసరిగా అతికించాలి.

గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఈనెల 10వ తారీకు లోపు స్థానిక పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయం, మేడిపల్లి లేదా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గృహలక్ష్మి కౌంటర్ లలో సంప్రదించి దరఖాస్తులు సమర్పించగలరు. ఫీల్డ్ వెరిఫికేషన్ **తేదీ : 20.08.2023**. ఇళ్ల మంజూరు **తేదీ : 25.08.2023.**

# రానున్న రోజుల్లో ప్రతి వార్డులో నీటి కొరత లేకుండా చర్యలు



**జయభేరి, ఘట్ కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మంచి నీటి కోసం మంగళవారం నూతన బోర్ వేపిస్తున్న ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, స్థానిక వార్డు కౌన్సిలర్ నశ్రీన్ సుల్తానా. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ... ఘట్కేసర్ మున్సిపాలిటీ లో 6, 14, 15వ వార్డులో మంచి నీటి కొరత ఉనందున నూతన బోర్ వేసికోవడం జరుగుతుందని, అదేవిధంగా రానున్న రోజుల్లో ప్రతి వార్డులో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలుపుతూ... ఘట్కేసర్ మున్సిపాలిటీ నందు ప్రతి వాడ, ప్రధాన రహదారిపై శుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుద్ధ్య కార్మికుల కు సూచించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS నాయకులు సిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇమ్ము, బాబు, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తల్లిపాల వారోత్సవం

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ డివిజన్, ఉప్పల్ హిల్స్ కాలనీ అంగన్వాడీ సెంటర్ లో జరిగిన తల్లిపాల వారోత్సవానికి కార్పొరేటర్ మందముల రజితపరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్టు, ఉప్పల్ సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లి పాల వారోత్సవం జరిగింది. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలను తాగించడమే ఆరోగ్యకరమని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి సూచించారు. ఆ తర్వాత కూడా బిడ్డకు తల్లిపాలనే తాగించాలన్నారు. కార్యక్రమంలో ICDS అధికారి CDPO స్వాతి, సూపర్ వైజర్ పార్వతి, హెల్త్ అధికారి పద్మ, అంగన్ వాడీ టీచర్స్, తుమ్మల దేవి రెడ్డి, దుర్గం నవీన్ యాదవ్, గోవింద్ కుమార్, మేడి గిరిబాబు, సల్ల ప్రభాకర్ రెడ్డి, ముక్కల సంతోష్ రెడ్డి, రామ్ చందర్, జడల నాగరాజ్ పాల్గొన్నారు.

జయభేరి సినిమా

## మెగాస్టార్ మనసులో కొరిక కుమారుడి రూపంలో!



శంకర్ దర్శకత్వంలో నటించాలని ఏ హీరో ఆశపడడు. ఆయనతో పనిచేయాలని ప్రతీ భారతీయ నటుడు కోరుకుంటారు. పాన్ వరల్డ్ లో మార్కెట్ ఉన్న హీరోల్నే ఎంపిక చేసుకుంటారు. టెక్నీకల్ నేపథ్యం గల సినిమాలు చేసినా అందులోనూ తప్పని సరిగా తనదైన మార్క్ సందేశం ఉంటుంది. గతంలో `రోబో` సినిమా ప్రచార సమయంలో మెగాస్టార్ చిరంజీవి సైతం శంకర్ తో పనిచేయాలని ఉందన్న మనసులో కోర్కెను బయటపెట్టారు. శంకర్ చిరంజీవి కాంబినేషన్ ఎందుకు తీయకూడదంటే? ఆయన పాన్ వరల్డ్ మార్కెట్ ఉన్న స్టార్స్ తోనే చేస్తారని చిరంజీవి ఆ సమయంలో ఓపెన్ గానే చెప్పారు. సరిగ్గా చిరంజీవి కోరిక ఇప్పుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూపంలో తీరుతుంది. ప్రస్తుతం చరణ్ హీరోగా శంకర్ `గేమ్ ఛేంజర్` అనే సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. కేవలం తెలుగులోనే ఈ సినిమా చేస్తున్నారు. మిగతా అన్ని భాషల్లో అనువాదా రూంపలో రిలీజ్ కానుంది. ఇది పొలిటికల్ థ్రిల్లర్ అని....చరణ్ ఐఏఎస్ నుంచి పొలిటీషయన్ గా టర్న్ అయ్యే పాత్రలో కనిపిస్తాడని ప్రచారం సాగుతోంది. `ఒకే ఒక్కడు` రేంజ్ లో సినిమా సమాజాన్ని ...వ్యవస్థల్ని ప్రశ్నించేలా ఉంటుందని... ఇప్పటి సాంకేతిక తను వినియోగించుకుని..ట్రెండ్ ని ఫాలో అవుతూ అంతర్జాతీయ కంటెంట్ తోనే సినిమా ఉంటుందని ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ విషయంలో చిరంజీవి చాలా సంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. తనతో కాకపోయినా కుమారుడితో శంకర్ సినిమా చేయడం పట్ల చిరు సంతోషాన్ని మాటల్లో వర్ణించలేనిది. ఈ సినిమా ప్రచార సమయంలో చిరంజీవి గత వ్యాఖ్యల్ని స్మరించుకునే అవకాశం ఉంది.



## లక్షలాది వ్యూస్ తో ఆకట్టుకుంటున్న "తెలుగింటి సంస్కృతి"



పెళ్లాం ఊరెళితే, ఇంద్ర వంటి సూపర్ హిట్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంతి హారతి పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయ్యారు. అక్కడ ఆమె ఓంకార అనే కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. ప్రశాంతి హారతి దగ్గరే ఆమె కూతురు తాన్య హారతి కూచిపూడి డాన్స్ నేర్చుకుంది. తాన్య హారతి ప్రధాన పాత్రలో తెలుగింటి సంస్కృతి పేరుతో మ్యూజిక్ వీడియోకు ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య కాన్సెప్ట్ తయారుచేసి రూపొందించారు. కిరణ్ గుడిపూడి ఈ వీడియోలో మరో లీడ్ రోల్ చేశారు. ఇటీవలే దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేసిన తెలుగింటి సంస్కృతి మ్యూజిక్ వీడియోకు లక్షలాది వ్యూస్ వస్తున్నాయి. రాధాకృష్ణ హారతి నిర్మాతగా వ్యవహరించారు. మురళి రుద్ర, అన్వేష్ మావిళ్ళపల్లి, ఆనంద్ పవన్ నాయుడు ఎడిటర్స్ గా పనిచేసిన తెలుగింటి సంస్కృతి వీడియోకు ఎస్ ఎ ఖుద్దూస్ సంగీతం అందించగా..శ్రీ రామ్ తపస్వి గీత రచన చేశారు. ప్రముఖ నేపథ్య గాయని శ్రీనిధి పాడిన ఈ పాట యూట్యూబ్ లో ట్రెండ్ అవుతోంది.

## 'సలార్' టీమ్ కీలక నిర్ణయం ?


పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా శృతి హాసన్ హీరోయిన్ గా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ సలార్. మొత్తం రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ మాస్ యాక్షన్ మూవీ యొక్క మొదటి భాగం సలార్ సీస్ ఫైర్ సెప్టెంబర్ 28న ప్రేక్షకాభిమానుల ముందుకి రానున్న సంగతి తెలిసిందే. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ మూవీని హోంబలే ఫిలిమ్స్ బ్యానర్ పై ఎంతో భారీ వ్యయంతో విజయ్ కిరగందూర్ నిర్మిస్తుండగా కీలక పాత్రల్లో శ్రియా రెడ్డి, జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ఈశ్వరిరావు నటిస్తున్నారు. అందరిలో భారీ అంచనాలు కలిగిన సలార్ గురించి ప్రస్తుతం ఇండస్ట్రీ లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ అయితే వైరల్ అవుతోంది. ఈ నెలాఖరున సలార్ ట్రైలర్ రిలీజ్ కానుండగా అప్పటివరకు మూవీకి సంబందించిన టీమ్ మెంబర్స్ ఎవరినీ కూడా ఎటువంటి మీడియా ఛానల్ ఇంటర్వ్యూస్ కానీ, లేదా ఇంటరాక్షన్ గాని పెట్టుకోవద్దని, అలానే పత్రికలకు కి కూడా ఎటువంటి న్యూస్ ఇవ్వవద్దని సూచించారట. అయితే సినిమాకి సంబంధించి ప్రస్తుతం పలు మీడియా మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారాలు వైరల్ అవుతుండడంతోనే టీమ్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు.

## నేచురల్ స్టార్ నాని 'దసరా'

### 100 డేస్ షీల్డ్స్ ప్రజంటేషన్ ఈవెంట్



నేచురల్ స్టార్ నాని మాసియస్ట్ పాన్ ఇండియా ఎంటర్టైనర్ 'దసరా' 2023 మార్చి 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. నాని కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సంచలన విజయం సాధించి సక్సెస్ ఫుల్ గా 100 రోజులని పూర్తి చేసుకుంది.ఈ సందర్భం మేకర్స్ చిత్ర యూనిట్, డిస్ట్రిబ్యూటర్లకు షీల్డ్స్ అందించారు. హీరో నేచురల్ స్టార్ నాని పాల్గొన్న ఈ గ్రాండ్ ఈవెంట్ లో నిర్మాతలు అనిల్ సుంకర, నాగ వంశీ, సాహుగారపాటి, గోపి అచంట హాజరయ్యారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించారు. కీర్తి సురేష్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి, సముద్రఖని, షైన్ టామ్ చాకో, సాయి కుమార్ కీలక పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణ్ సెన్సేషనల్ ఆల్బమ్ అందించారు.



## 'పుష్ప 2 ద రూల్' ఫహద్ ఫాజిల్

### భన్వర్ సింగ్ షెకావత్ సర్ కి పుట్టిన రోజు శభాకాంక్షలు

'పార్టీ లేదా పుష్ప' అంటూ 'పుష్ప' చిత్రంలో ఫహద్ ఫాజిల్ చెప్పిన డైలాగ్ ఎంతగా పాపులర్ అయిందో తెలిసిందే. మలయాళ నటుడే అయినా తెలుగులోనూ ఆయన మంచి గుర్తింపును అందుకున్నారు. ఈరోజు ఫహద్ ఫాజిల్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'పుష్ప 2 ద రూల్' నుంచి కొత్త పోస్టర్ తో తనకు బర్త్ డే విషెస్ ను అందజేశారు దర్శక నిర్మాతలు. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొని స్టైలిష్ గా సిగరెట్ తాగుతూ కనిపిస్తున్న ఫహద్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది.అలాగే ఈ చిత్రంలో ఫహద్ క్యారెక్టర్ ఎలా ఉంటుందో తెలియజేశారు మేకర్స్. 'ఈసారి ఆయన ప్రతీకారం తీర్చుకోడానికి వస్తున్నాడు' అంటూ ఫహద్ ఫాజిల్ ఫోటోకు క్యాప్షన్ ఇచ్చారు. 'పుష్ప ది రైజ్' లో అల్లు అర్జున్, ఫహద్ మధ్య పోటాపోటీగా సాగే సీన్స్.. 'పుష్ప 2 దిరూల్'పై అంచనాలు పెంచాయి. అలాగే ఇటీవల అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన 'వేర్ ఈజ్ పుష్ప' అనే కాన్సెప్ట్ వీడియో కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. 'అడవిలో జంతువులు రెండు అడుగులు వెనక్కు వేసాయంటే పులి వచ్చింది అని అర్థం.. అదే పులి రెండు అడుగులు వెనక్కు వేసిందంటే పుష్ప వచ్చిండాడు అని అని అర్థం' అని బన్నీ డైలాగ్ ఆ వీడియోకు హైలైట్ గా నిలిచింది. ప్యాన్ ఇండియా చిత్రంగా దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీకి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

## కుమారికి వెబ్ సీరీస్ లు కూడా కలిసి రావట్లేదు..!



తెలుగు సినిమాల్లో తెరంగేట్రం చేసిన హెబ్బా పటేల్ సుకుమార్ దృష్టిలో పడి కుమారి 21ఎఫ్ సినిమా ఛాన్స్ అందుకుంది. అంతకుముందు అలా ఎలా అనే సినిమాతో తెలుగు సినిమాల్లో తెరంగేట్రం చేసిన హెబ్బా పటేల్ సుకుమార్ దృష్టిలో పడి కుమారి 21ఎఫ్ సినిమా ఛాన్స్ అందుకుంది. ఆ సినిమా యూత్ ఫుల్ హిట్ అవడంతో కుమారి హెబ్బా రేంజ్ పెరిగిపోయింది. ఆ టైం లో హెబ్బా సరైన కథలు ఎంపిక చేసుకుని ఉంటే కచ్చితంగా ఆమె కెరీర్ వేరేలా ఉండేది కానీ ఆ టైం లో తనకు వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వెళ్లింది అమ్మడు. అలా చేయడం వల్ల ఆమె కెరీర్ రిస్క్ లో పడింది. కొన్ని సినిమాల్లో కేవలం ఆమెకు ఒకటి రెండు డైలాగ్స్ మాత్రమే ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఛాన్స్ లు లేని టైం లో ఎలాగైనా సినిమాల్లో కనిపించాలని స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది హెబ్బా పటేల్. ఈ క్రమంలో హెబ్బా పటేల్ కూడా డిజిటల్ ఎంట్రీ ఇచ్చింది. ఆల్రెడీ అంతకుముందు ఆహా కోసం మస్తీస్ అనే వెబ్ సీరీస్ చేసిన హెబ్బా పటేల్ లేటెస్ట్ గా జీ 5 లో వ్యవస్థ అనే సీరీస్ చేసింది. ఈ సీరీస్ పై అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది కానీ అది కూడా అంతగా వర్క్ అవుట్ అయినట్టు లేదు. సినిమాలు లేక వెబ్ సీరీస్ లు చేస్తున్న హెబ్బా పటేల్ ఇక్కడైనా లక్ కలిసి వస్తుందేమో అనుకుంటే అక్కడ కూడా తన బ్యాడ్ టైం కొనసాగుతుంది. అయితే తెలుగులో ఆమె చేసిన సినిమాల వల్ల అమ్మడికి తమిళ సినిమా ఛాన్స్ లు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చేస్తుంది హెబ్బా పటేల్. తెలుగులో కూడా తెలిసినవాళ్లు సినిమాలో నటిస్తుంది హెబ్బా పటేల్. సోలో హీరోయిన్ గా ఛాన్స్ లు రాకపోయినా స్టార్ సినిమా అయితే స్పెషల్ సాంగ్ అయినా చేసేందుకు రెడీ అంటుంది హెబ్బా పటేల్. తెలుగు తమిళంలో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తున్న హెబ్బాకి చేస్తున్న సినిమాలతో అయినా లక్ కలిసి రావాలని ఆశిద్దాం. సుకుమార్ ప్రొడక్షన్ లో ఫస్ట్ హిట్ అందుకున్న హీరోయిన్ ఇలా కెరీర్ ఫెడవుట్ అవడం అందరిని ఆశ్చర్యపరుస్తున్నా క్రేజ్ వచ్చినప్పుడే కథల మీద చేస్తున్న సినిమాల గురించి జాగ్రత్త పడాలని హెబ్బాని చూస్తేనే అర్థమవుతుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com